

లబ్దిదారులకు పథకాలను పంపిణీ చేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

అధ్వాన పాలన నుంచి అభివృద్ధి పథంలోకి...

సీఎం స్టాలిన్

● రాష్ట్ర ప్రగతిని చూసి ఓర్వలేక ఈపీఎస్ విమర్శలంటూ ధ్వజం

చెన్నై, జనవర 22 (ఆంధ్రజ్యోతి): గత అన్నాడీఎంకే ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అథఃపాతాళంలోకి వెళ్ళిందని, ఇపుడు తమ హయాంలో రాష్ట్రం సాధిస్తున్న పురోగతిని చూసి ఆ పార్టీ నేతలు ఓర్వలేకపోతున్నారని ముఖ్యమంత్రి స్టాలిన్ మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామిపై ధ్వజమెత్తారు. శివగంగై జిల్లాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి... బుధవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొని రూ.376.49 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించి, 33 కొత్త పనులకు శంకుస్థాపన చేశారు. 53,039 మంది అర్హులకు సంక్షేమ సహాయాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం స్టాలిన్ మాట్లాడుతూ మూడున్నరేళ్ళ డీఎంకే ద్రావిడ మోడల్ ప్రభుత్వంలో జిల్లాలో జరిగిన అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష చేసామని, అనేక అభివృద్ధి పనులను పూర్తి చేసినట్టు తెలిపారు. ఈ ఒక్క జిల్లాలోనే 2.38 లక్షల మంది అర్హులైన మహిళలకు నెలకు రూ.1000 నగదు అందజేస్తున్నామన్నారు. ఈ మూడున్నరేళ్ళ కాలంలో 91,265 పనులకు రూ.55,55,426 విలువ చేసే అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను అమలు చేశామన్నారు. ప్రతి జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను గణాంకాలతో సహా ప్రజలకు వివరిస్తున్నట్టు చెప్పారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఎన్నికల హామీలు 505 కాగా, ఇప్పటికే 389 నెరవేర్చామన్నారు. మరో 116 హామీలు నెరవేర్చాల్సి ఉందన్నారు. ప్రభుత్వ 34 శాఖల్లో అన్ని అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని, ఈ విషయాలన్నీ తెలిసిన మాజీ ముఖ్యమంత్రి ఈపీఎస్ ఏమీ తెలియనట్టుగా నటిస్తున్నారని, దీనికి కారణం.. ఆయన మరో పార్టీ ఇచ్చే ప్రకటన చదవడమేనన్నారు. 2011, 2016 ఎన్నికల సమయంలో అన్నాడీఎంకే ఇచ్చిన ఎన్నికల హామీలెన్ని? వాటిలో ఎన్ని అమలు చేశారు? అనే విషయాలను ప్రతిపక్ష నేత బహిరంగంగా వెల్లడించడానికి సిద్ధంగా ఉన్నారా? అని ప్రశ్నించారు. ఎడప్పాడి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అన్నాడీఎంకే అనుకూల ప్రభుత్వం కేంద్రంలో వుందని, అపుడు ఏ ఒక్క లబ్ది రాష్ట్రానికి చేకూర్చలేదన్నారు. కానీ, పదవి కోసం ఢిల్లీకి వెళ్ళి సాగిలబడ్డారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం రాష్ట్ర ప్రగతి కోసమే ఢిల్లీకి వెళ్లామని స్టాలిన్ వివరించారు.

6 నుంచి సీఎం తిరునల్వేలి పర్యటన

ప్యారీస్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ ఫిబ్రవరి 6,7 తేదీల్లో తిరునల్వేలిలో పర్యటిస్తారని పురపాలక శాఖామంత్రి కేఎన్ నెహ్రూ తెలిపారు. తిరునల్వేలిలో సీఎం పర్యటించనున్న ప్రాంతాలను ఉన్నతాధికారులతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, సీఎం స్టాలిన్ ఫిబ్రవరి 6,7 తేదీల్లో తిరునల్వేలి జిల్లాల్లో పర్యటించి 30వేల మంది లబ్ధిదారులకు సంక్షేమ సహాయాలు పంపిణీ చేస్తారని, రూ.6184.46 కోట్లతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని తెలిపారు. సీఎం స్టాలిన్ 6వ తేదీ ఉదయం 11 గంటలకు విమానంలో తూత్తుకుడికి చేరుకుంటారని, అక్కడి నుండి రోడ్డు మార్గంలో తిరునల్వేలి చేరుకుని ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటారని మంత్రి కేఎన్ నెహ్రూ తెలిపారు.

ఏమైవుంటుదబ్బా?!

నేడు ముఖ్యమైన ప్రకటన చేస్తానంటూ సోషల్ మీడియాలో సీఎం పోస్టుపై తమిళనాట ఆసక్తి

'రేపు ముఖ్యమైన ప్రకటన చేస్తా. వీలున్న వారు రండి... రాలేని వారు ప్రత్యక్ష ప్రసారం వీక్షించండి' అంటూ ముఖ్యమంత్రి స్టాలిన్ బుధవారం సామాజిక మాధ్యమాల్లో విజ్ఞప్తి చేశారు. కొట్టూరుపురంలో ఉన్న అన్నా సెంటినరీ లైబ్రరీలో గురువారం ఉదయం 10 గంటలకు జరుగనున్న కార్యక్రమంలో కీళడిలో మ్యూజియం, గంగం గంగమకసకండ సోళపురంలో మ్యూజియం నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ఆ సమయంలోనే సీఎం ముఖ్యమైన ప్రకటన చేస్తారని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. దీంతో స్టాలిన్ చేయబోయే ముఖ్యమైన ప్రకటన ఏంటన్నదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఈడీ విచారణకు వేలూరు ఎంపీ హాజరు



విచారణకు వెళ్తున్న కదిర్ ఆనంద్

ప్యారీస్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వేలూరు ఎంపీ, డీఎంకే సీనియర్ నేత కదిర్ ఆనంద్ బుధవారం ఎన్‌ఫోర్స్ డిపార్ట్‌మెంట్ (ఈడీ) కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. డీఎంకే ప్రధాన కార్యదర్శి, సీనియర్ మంత్రి దురైమురుగన్ కుమారుడు కదిర్ ఆనంద్ వేలూరు జిల్లా కాట్పాడి సమీపంలోని క్రిస్టియన్ పేటలో నడుపుతున్న కింగ్‌స్టన్ ఇంజనీరింగ్ కళాశాల, కాట్పాడిలో ఉన్న ఎంపీ ఇళ్లు, డీఎంకే నేత పూంజోలై శ్రీనివాసన్, బంధువు దామోదరన్ ఇళ్లు, కార్యాలయాల్లో ఈనెల 3వ తేదీ ఈడీ అధికారులు సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఇందులో పూంజోలై శ్రీనివాసన్ ఇంట్లో రూ.28 లక్షలు, కింగ్‌స్టన్ కళాశాలలో రూ.13.7 కోట్లు, కదిర్ ఆనంద్ ఇంటి ఉన్న లాకర్లో రూ.75 లక్షలు తదితరాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా కింగ్‌స్టన్ ఇంజనీరింగ్ కళాశాల అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం, గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన తనిఖీల్లో కదిర్ ఆనంద్ ట్రస్టులకు సంబంధించిన కీలక పత్రాలు, హార్డ్‌డిస్క్‌లు, డిజిటల్ నగదు లావాదేవీలు, ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు తదితరాలను పరిశీలించిన అధికారులు, వాటిలో కొన్నింటిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. నాలుగు రోజుల తనిఖీలపై చేపట్టనున్న విచారణకు హాజరు కావల్సిందిగా ఈడీ అధికారులు ఎంపీకి సమన్లు జారీ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం నగరంలోని ఈడీ కార్యాలయానికి ఎంపీ కదిర్ ఆనంద్ రాగా అతడిని ఈడీ అధికారులు విచారణ జరిపారు.

డెల్టాలో కేంద్ర బృందం పర్యటన

● ధాన్య సేకరణ కేంద్రాల పరిశీలన

అడయార్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): డెల్టా జిల్లాల్లోని ధాన్య సేకరణ కేంద్రాల్లో కేంద్ర బృందం బుధవారం నుంచి పరిశీలిస్తోంది. 22 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై అధ్యయనం చేసేందుకు నియమించిన కేంద్ర కమిటీ మూడు రోజుల పాటు ధాన్య సేకరణ కేంద్రాలను పరిశీలించనుంది. డెల్టా జిల్లాల్లో గత వారం రోజులుగా జల్లులు పడుతున్నాయి. దీంతో పండించిన ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉంది. ఈ ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని రైతులతో పాటు డెల్టా ప్రాంత ప్రజలు, రైతు సంఘాల ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీంతో ధాన్యంలో తేమ 17 శాతం కాకుండా 22 శాతం వరకు ఉన్నప్పటికీ కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. ఆహార శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కె.రాధాకృష్ణన్ ఢిల్లీ వెళ్ళి వ్యవసాయ, ఆహార శాఖ ఉన్నతాధికారులతో చర్చించారు. ఆయన చొరవ కారణంగా తేమ శాతాన్ని నిర్ధారించి, ధాన్య సేకరణ కేంద్రాలను పరిశీలించేందుకు కేంద్రం ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ సభ్యులు బుధవారం తంజావూరులో పర్యటించి, ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. గురువారం నాగపట్టణం, 24వ తేదీ మైలాడుదురై జిల్లాలో పర్యటిస్తారు. 25వ తేదీన ఆయా జిల్లాల్లో సేకరించిన ధాన్యాన్ని చెన్నైలో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు చెందిన ప్రయోగశాలలో పరీక్షించనున్నారు.

2,211 పాఠశాలలకు త్వరలో శతవార్షికోత్సవాలు

అడయార్,జనవరి22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2211 పాఠశాలలు శతవసంతాలు పూర్తి చేసుకున్నాయి. దీంతో ఈ స్కూల్స్ శతవార్షికోత్సవాలను నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. వాటిలో మాజీ ముఖ్యమంత్రి దివంగత కలైంజర్ కరుణానిధి చదివిన తిరుక్కువన్ పాఠశాల కూడా ఉంది. ఇలా వందేళ్ళు పూర్తి చేసుకున్న పాఠశాలల శతవార్షిక వేడుకలకు ఆయా పాఠశాలల చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆహ్వానించి ఘనంగా నిర్వహించాలని భావిస్తోంది. ఇందులో భాగంగా, తిరుక్కువనై పంచాయతీ పాఠశాలను రాష్ట్ర విద్యాశాఖా మంత్రి అన్బిల్ మహేష్ బుధవారం సందర్శించి, శతవార్షిక జ్యోతి(టార్చ్)ని వెలిగించారు. ఈ జ్యోతిని జిల్లాలో అన్ని పాఠశాలలకు తీసుకెళతారు. ఇది వచ్చే నెల 2వ తేదీ వరకు సాగుతుంది. ఆ తర్వాత వందేళ్ళు పూర్తి చేసుకున్న పాఠశాలల్లో శతవార్షిక వేడుకలను ఆయా పాఠశాలల వార్షిక వేడుకలతో కలిపి నిర్వహిస్తారు. . ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు విద్యాశాఖ ప్రత్యేకంగా నిధులను కూడా కేటాయించింది. కాగా తమిళనాడు రాష్ట్రంలోనే అతిపురాతన పాఠశాలగా చెన్నై నగరంలోని ప్రెసిడెన్సీ మహిళా హయ్యర్ సెకండరీ పాఠశాల గుర్తింపు పొందింది. ఈ పాఠశాలను 240 యేళ్ళ క్రితం స్థాపించారు.

పోలీస్‌స్టేషన్ ముందే ఆత్మాహుతి

● పోలీసుల బెదిరింపుతోనే బలి

● కుటుంబీకుల ఆరోపణ



రాజన్ (ఫైల్ ఫొటో)



మంటల్లో కాలుతున్న రాజన్

చెన్నై, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పోలీసుల వ్యవహారశైలితో విసిగిపోయిన ఓ వ్యక్తి ఏకంగా పోలీస్ స్టేషన్ ముందే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అందరూ చూస్తుండగా, శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని బుగ్గిపాలైపోయాడు. అతను పులియాంతోపు తిరువికనగర్ 7వ వీధికి చెందిన రాజన్ (42)గా గుర్తించారు. ఆర్‌కే నగర్ పోలీస్ స్టేషన్ ముందు మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘటన సంచలనం రేపింది. వివరాలిలా వున్నాయి...

తిరువిక నగర్ 7వ వీధికి చెందిన రాజన్ కొరుక్కుపేట కరుమారియమ్మన్ నగర్‌లో స్టీల్ వర్క్‌షాప్ నడుపుతున్నాడు. రాజన్‌కు వివాహమై ముగ్గురు పిల్లలున్నారు. వ్యాపారంలో నష్టం రావడంతో వర్క్‌షాప్ మూసివేసి, కొరుక్కుపేట అన్బళగన్ వీధిలోని మురుగన్‌కు చెందిన వర్క్ షాప్‌లో మూడు రోజుల క్రితం చేరాడు. మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు రాజన్‌కు, అదే వర్క్ షాప్‌లో పనిచేస్తున్న భారతి నగర్ హౌసింగ్ బోర్డుకు చెందిన మాధవన్ (46)కు మధ్య వాగ్వివాదం జరిగింది. వర్క్‌షాప్ యజమాని మురుగన్ జోక్యం చేసుకొని ఇద్దర్నీ సర్దిచెప్పి పంపించాడు. ఈ ఘటనతో మనస్తాపం చెందిన రాజన్.. కొద్దిసేపటికి కొరుక్కుపేట అన్నానగర్ వేలన్ సత్రం సమీపంలోని టాస్మాక్ దుకాణానికి వెళ్లి మద్యం సేవించాడు. ఆ సమయంలో అక్కడకు వచ్చిన మాధవన్, రాజన్ మధ్య మళ్లీ వాగ్వివాదం జరిగింది. అక్కడకు మద్యం సేవించేందుకు వచ్చిన అరుణ్‌కుమార్ అనే వ్యక్తి, మాధవన్‌తో కలసి రాజన్‌పై దాడిచేసినట్లు సమాచారం. దీంతో సాయంత్రం 3.45 గంటల సమయంలో రాజన్ ఆర్కే నగర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, తనపై దాడి చేసినవారిపై చర్యలు చేపట్టాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ సూచించినట్లు సమాచారం. ఆ సమయంలో మద్యం మత్తులో ఉన్న రాజన్ కోపంగా వెనుదిరిగాడు. రాత్రి 9.15 గంటల సమయంలో మళ్లీ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. స్టేషన్ ముందు నిలబడి పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని అంటించుకున్నాడు. దీంతో మంటల్లోనే కాలిపోతున్న రాజన్‌ను గమనించిన పోలీసులు బక్కెట్లతో నీటిని తెచ్చి మంటలను చల్లార్చారు. కానీ అప్పటికే అతడి శరీరం 90 శాతం కాలిపోయింది. అనంతరం పోలీసులు అతడిని కీల్పాక్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించక అతను పొద్దుపోయాక మృతి చెందాడు. ఈ వ్యవహారంలో అరుణ్‌కుమార్‌ను అరెస్టు చేసిన పోలీసులు, మాధవన్ కోసం గాలిస్తున్నారు. కాగా రాజన్ ఆత్మహత్యకు పోలీసుల వైఖరే కారణమంటూ మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు.



సీమాన్ ఇంటి ముట్టడికి యత్నిస్తున్న ఆందోళనకారులు

● పెరియార్‌పై అనుచిత వ్యాఖ్యలు

సీమాన్ ఇంటి ముట్టడికి యత్నం

200 మంది అరెస్ట్



సీమాన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నిరసనకారులు

ప్యారీస్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ పితామహుడు పెరియార్ కోసం అనుచిత వ్యాఖ్యలు చేసిన 'నామ్ తమిళర్ కట్చి' అధినేత సీమాన్ వైఖరికి నిరసనగా నీలాంగరైలోని ఆయన ఇంటిని ముట్టడించేందుకు యత్నించిన సుమారు 200 మంది ఆందోళనకారులను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల పెరియార్ గురించి ఓ సభలో సీమాన్ విమర్శించారు. సీమాన్ వ్యాఖ్యలను ఖండించిన ద్రావిడ కళగం సీమాన్‌కు వ్యతిరేకంగా పలు పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. అదే విధంగా మద్రాస్ హైకోర్టులో కూడా సీమాన్‌కు వ్యతిరేకంగా కేసులు దాఖలయ్యాయి. ఈ నేపథ్యంలో తందై పెరియార్ ద్రావిడ కళగం, ఈయక్కం, ద్రావిడర్ విడుదలై కళగం సహా పెరియార్ అభిమానులు సీమాన్ ఇంటిని ముట్టడించి నిరసన వ్యక్తం చేయనున్నట్లు ముందే ప్రకటించి పోస్టర్లు కూడా అంటించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఈసీఆర్ రోడ్డు నీలాంగరై ప్రాంతంలో సీమాన్ ఇంటికి వెళ్లే దారిలో బారికేట్లు ఏర్పాటు చేశారు. ఈనేపథ్యంలో సుమారు 200 మంది ఆందోళనకారులు సీమాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఇంటిని ముట్టడించేందుకు ర్యాలీగా బయలుదేరగా, పోలీసులు అడ్డుకుని అందరిని అరెస్టు చేశారు.

కువైట్‌లో ఇద్దరు రాష్ట్ర వాసుల మృతి



మృతులు మహ్మద్ జునైద్, మహ్మద్ యాసిన్ (ఫైల్‌ఫొటో)

ప్యారీస్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కువైట్ దేశంలో డ్రైవర్లుగా పనిచేస్తున్న కడలూరుకు చెందిన ఇద్దరు తమిళులు మృతి చెందారు. కువైట్‌లో ప్రస్తుతం విపరీతమైన చలితో పాటు మంచు కురుస్తుండడంతో వలస కార్మికులు ఉపశమనం కోసం ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో కడలూరు మంగళంపేటకు చెందిన మహ్మద్ జునైద్, మహ్మద్ యాసిన్ కొనేళ్ల క్రితం కువైట్ వెళ్లి డ్రైవర్ ఉద్యోగాల్లో చేరారు. వీరు తిరువణ్ణామలైకు చెందిన గౌసబాషా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ యువకుడు కలిసి ఓ గదిలో ఉంటున్నారు. ఇదిలా ఉండగా ఆదివారం చలికి తట్టుకోలేకపోయిన మహ్మద్ జునైద్, మహ్మద్ యాసిన్ తమ స్నేహితులతో కలిసి గది బయట చలికాచుకునేందుకు మంటలు వేశారు. మంటల నుండి వ్యాపించిన పొగ వారున్న గది మొత్తం వ్యాపించింది. కొద్దిసేపు చలికాచుకున్న అనంతరం వారు గదికి వెళ్లి నిద్రలోకి జారుకున్నారు. మంచు కురుస్తుండటంతో గది కిటికీ తలుపులు మూసివేశారు. దాంతో ఆ గదిని పొగ కమ్మేసింది. గాఢ నిద్రలో ఉన్న మహ్మద్ జునైద్, మహ్మద్ యాసిన్ సహా ఉత్తరప్రదేశ్‌కు చెందిన కార్మికుడు ఊపిరాడక నిద్రలోనే ప్రాణాలు విడిచారు. అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడిన తిరువణ్ణామలైకు చెందిన గౌసబాషా ఈ దుర్ఘటనపై కువైట్‌లో ఉన్న భారత దౌత్య కార్యాలయ అధికారులకు సమాచారమందించాడు. కాగా, మృతదేహాలను కువైట్ నుండి రాష్ట్రానికి తరలించేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టాలని మృతుల కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

ఉపాధి హామీ వేతనాలు చెల్లించాలి

● ప్రతిపక్షనేత ఎడప్పాడి



ప్యారీస్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం లబ్దిదారులకు బకాయి ఉంచిన రెండు నెలల వేతనాన్ని వెంటనే పంపిణీ చేయాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతి పక్షనేత ఎడప్పాడి పళనిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం శ్రామికవర్గాల సంక్షేమాన్ని విస్మరించిందని తెలిపారు. 2021లో రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో ఉపాధి హామీ పథకంలో కార్మికులకు 150 రోజులు పనిదినాలు పెంచి, రోజువారీ వేతనం రూ.300గా పెంచి ఇస్తామని డీఎంకే హామీ ఇచ్చిందని తెలిపారు. అధికారంలోకి వచ్చి మూడున్నారేళ్లు గడుస్తున్నా ఈ హామీని నెరవేర్చకపోవడంతో పాటు, ఆ కార్మికులకు గత రెండు నెలలుగా వేతనం చెల్లించకుండా ఇబ్బందులపాలు చేసిందని ఆరోపించారు. వేతనం అందక ఈ ఏడాది పొంగల్‌ను రాష్ట్రంలోని పలు జిల్లాల్లోని శ్రామిక వర్గాలు జరుపుకోలేదంటూ రాష్ట్రప్రభుత్వాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఈపీఎస్ తెలిపారు.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా పూందమల్లి, అత్తిపట్టు పుదునగర్ ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

పూందమల్లి: పూందమల్లి మున్సిపాలిటీ, తెన్నీర్‌కుప్పం, కరయాన్‌చావిడి, తులసిదాస్ నగర్, చిన్న మాంగోడు, కుమనన్ చావిడి

అత్తిపట్టు పుదునగర్: అత్తిపట్టు పుదునగర్, చెప్పాకం, మవుత్తంబేడు, కేఆర్ పాళయం, కాట్టుపల్లి, కాట్టుపల్లి ఇండస్ట్రియల్, తమిళ్‌కురింజియూర్, నందియంబాక్కం, కాళంజి, కరయాన్‌మేడు.

25న చెన్నై బీచ్-వేళచ్చేరి రైళ్ల వేళల్లో మార్పులు

చెన్నై, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక చేపాక్కం ఎంఎ చిదంబరం స్టేడియంలో ఈ నెల 25వ తేది భారత్-ఇంగ్లాండ్ మధ్య రెండో టి20 క్రికెట్ మ్యాచ్ జరుగనుంది. ఈ మ్యాచ్‌కు హాజరయ్యే అభిమానుల సౌకర్యార్థం ఆ రోజు చెన్నై బీచ్-వేళచ్చేరి ఎమ్మార్టీఎస్ రైళ్ల వేళల్లో మార్పులు చేసినట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. ఆ ప్రకారం, 25వ తేది చెన్నై బీచ్ నుంచి రాత్రి 9.50 గంటలకు బయల్దేరే ఎమ్మార్టీఎస్ రైలు 10 గంటలకు, 10.20 గంటలకు బయల్దేరే రైలు 10.30 గంటలకు బయల్దేరనున్నాయి. అలాగే, వేళచ్చేరి నుంచి రాత్రి 10 గంటలకు చెన్నై బీచ్‌కు బయల్దేరే ఎమ్మార్టీఎస్ రైలు 10.27 నుంచి 10.37 గంటలు (10 నిముషాలు) చేపాక్కం రైల్వేస్టేషన్‌లో ఆగనుందని దక్షిణ రైల్వే తెలిపింది.

కీళడి ఓపెన్ మ్యూజియం

పెరంబూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా కీళడిలో కేంద్ర పురావస్తు శాఖ మూడు విడతల తవ్వకాలు చేపట్టగా, రాష్ట్ర ప్రభుత్వం పలు విడతలుగా తవ్వకాలు చేపడుతోంది. తవ్వకాల్లో బయటపడిన కళాఖండాలను భూమి లోపల నుంచే వీక్షించేలా ఓపెన్-ఎయిర్ మ్యూజియం ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మ్యూజియం ఏర్పాటుకు ఈనెలాఖరులో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శంకుస్థాపన చేయనున్నారని అధికారులు తెలిపారు.

రేపు ఎంటీసీలో 'డ్రైవర్స్ డే'

పెరంబూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) మెట్రో‌ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ)లో శుక్రవారం 'డ్రైవర్స్ డే' వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంటీసీ మేనేజింగ్ డైరెక్టర్ శాఖా మేనేజర్లు, డిపో మేనేజర్లకు జారీచేసిన సర్క్యులర్‌లో... ఈ నెల 24న 'వరల్డ్ డ్రైవర్స్ డే' జరుపుకుంటున్నారన్నారు. ఆ రోజున ఎంటీసీలో డ్రైవర్ల సహకారాన్ని అభినందిస్తూ 'బస్సును సురక్షితంగా నడిపినందుకు ధన్యవాదాలు' అంటూ డ్రైవర్లకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపాలని సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

28 మంది ఎస్పీలకు ఐపీఎస్ హోదా

పెరంబూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ద్వారా ఎంపికై రాష్ట్రంలో ఎస్పీలుగా పనిచేస్తున్న 28 మంది అధికారులకు ఐపీఎస్ హోదా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం కూడా 28 మంది అధికారులకు ఐపీఎస్ హోదా కల్పిస్తూ మంగళవారం ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలో గ్రూప్-1 ద్వారా డీఎస్పీలుగా ఉద్యోగంలో చేరిన వారికి సీనియారిటీ ఆధారంగా ఎస్పీగా పదోన్నతులు కల్పిస్తుంటారు. ఆ ప్రకారం 28 మంది ఎస్పీలు ఐపీఎస్ హోదా పొందారు.

మదురై-పళని ప్రత్యేక రైలు

పెరంబూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పళని మురుగన్ ఆలయానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం మదురై-పళని మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నారు. పళని ఆలయ 2025 తైపూసం ఉత్సవాలు ఫిబ్రవరి 5వ తేది ధ్వజారోహణంతో ప్రారంభమై 14వ తేది వరకు జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు పలు జిల్లాలు సహా పొరుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొంటారు. ఈ ఉత్సవాకు హాజరయ్యే భక్తుల సౌకర్యార్థం మదురై-పళని మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, మదురై జంక్షన్ నుంచి ఫిబ్రవరి 11,15 తేదీల్లో ఉదయం 8.45 గంటలకు బయల్దేరే రైలు 11.30 గంటలకు పళని చేరుకుంటుంది. మరుమార్గంలో 11,12 తేదీల్లో మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరి సాయంత్రం 5.45 గంటలకు పళని చేరుకుంటుంది.

అన్నదానానికి అనుమతులు తప్పనిసరి

పెరంబూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా పళని ఆలయానికి తై మాసం సందర్భంగా వివిధ జిల్లాల నుంచి భక్తులు పాదయాత్రగా వెళుతుంటారు. పాదయాత్ర చేస్తూ వచ్చే భక్తులకు పలు సంస్థలు అన్నదానం చేస్తుంటాయి. ఈ నేపథ్యంలో, జిల్లా ఆహార భద్రతా శాఖ అధికారులు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... పాదయాత్ర భక్తులకు అన్నదానం చేసేందుకు తప్పనిసరిగా అనుమతి పొందాలన్నారు. అనుమతి లేకుండా అన్నదానం చేస్తే రూ.1,000 జరిమానా విధిస్తామని అధికారులు హెచ్చరించారు.

రేషన్ దుకాణాలకు రూ.300 కోట్ల సబ్సిడీ

పెరంబూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సహకార శాఖ ఆధ్వర్యంలోని రేషన్ దుకాణాలకు రూ.300 కోట్ల అడ్వాన్స్ సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రేషన్ దుకాణాలకు 2024-25వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దుకాణాల అద్దె, విద్యుత్ బిల్లులు, ఉద్యోగుల వేతనాలు, రవాణా ఖర్చులు తదితరాలకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తోంది ఈ నేపథ్యంలో, రేషన్ దుకాణాల ఖర్చులకు సబ్సిడీగా రూ.300 కోట్లు అందించాలనే సహకార శాఖ విజ్ఞప్తితో, రూ.300 కోట్ల అడ్వాన్స్ సబ్సిడీ విడుదల చేసినట్లు ప్రభుత్వం తెలిపింది.

నగరంలో 15 ప్రాంతాల్లో పశువుల షెడ్లు

● చెన్నై కార్పొరేషన్ చర్యలు

చెన్నై, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై సంచరిస్తున్న పశువులతో తలెత్తుతున్న ఇబ్బందులు అడ్డుకొనేలా గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) 15 ప్రాంతాల్లో పశువుల షెడ్ల నిర్మాణాలు చేపట్టింది. నగరంలో రోడ్లపై సంచరిస్తున్న పశువులను కార్పొరేషన్ ఉద్యోగులు పట్టుకొని, వాటి యజమానులకు జరిమానా విధించినా ఆశించిన ఫలితాలు రావడం లేదు. గత ఏడాది అక్టోబరులో ట్రిప్లికేన్‌లో పశువు పొడిచి వృద్ధుడు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ విషయమై దృష్టి సారించిన కార్పొరేషన్ 2023లో రోడ్లపై సంచరిస్తున్న 4,237 పశువులను పట్టుకొని, వాటి యజమానుల నుంచి రూ.92,04,700 జరిమానా వసూలుచేశారు. అలాగే, 2024లో 2,427 పశువులను పట్టుకొని, రూ.1,30,71,000 జరిమానా వసూలుచేశారు.

జరిమానా భారీగా పెంపు...

ఈ నేపథ్యంలో, గత ఏడాది నుంచి తొలిసారి పశువు పట్టుబడితే విధిస్తున్న జరిమానా రూ.5వేల నుంచి రూ.10వేలకు పెంచారు. రెండో సారి పట్టుబడితే విధించే జరిమానా రూ.10వేల నుంచి రూ.15వేలకు పెంచారు. అలాగే, తొలిసారిగా పట్టుబడే పశువులను గుర్తించేలా వాటి శరీరంలో చిప్ అమర్చే ఆలోచనలో కార్పొరేషన్ అధికారులున్నారు. ఇలాంటి చర్యలు చేపట్టినప్పటికీ రోడ్లపై పశువుల సంచారాన్ని అరికట్టలేకపోతున్నారు. ఈ విషయమై పశువుల యజమానుల అభ్యర్థనతో కార్పొరేషన్ ఆధ్వర్యంలో 15 ప్రాంతాల్లో షెడ్లు ఏర్పాటవుతున్నాయి. ఈ విషయమై పశువుల యజమానుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దురై నరసింహన్ మాట్లాడుతూ... నగరంలో 5వేల కుటుంబాలు పశువులను పెంచుతున్నారని తెలిపారు. పశువులను ఉంచేందుకు తగినస్థలం కల్పించాలని కార్పొరేషన్‌కు విజ్ఞప్తి చేశామని తెలిపారు. అలాగే, పశువుల షెడ్లకు విద్యుత్, తాగునీరు, సంరక్షణ రుసుము, పన్ను, మురుగునీటి చార్జీలు తామే భరిస్తామని తెలిపామన్నారు. ప్రస్తుతం షెడ్ల నిర్మాణం జరుగుతోందని, అద్దె విషయమై కార్పొరేషన్ ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదని తెలిపారు. ఈ విషయమై కార్పొరేషన్ కమిషనర్ జె.గురుపరన్ మాట్లాడుతూ... ఒక్కో ప్రాంతంలో సుమారు 200 పశువులు సంరక్షించేలా 19 పశువుల షెడ్లు ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఇది త్వరలోనే అందుబాటులోకి వస్తాయని, ఈ షెడ్లలో నగరంలోని రోడ్లపై సంచరిస్తున్న సుమారు 3,000 పశువులు సంరక్షించడంతో పాటు ప్రమాదాలు కూడా నివారించవచ్చని కమిషనర్ తెలిపారు.



నిర్మాణంలో పశువుల షెడ్లు

రూ.22 కోట్లతో కాలువలకు రక్షణ గోడ

పెరంబూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోడంబాక్కం మండలంలోని కాలువలకు రూ.22 కోట్లతో రక్షణ గోడ ఏర్పాటుచేయనున్నారు. కోడంబాక్కం మండల పరిధిలోని 127 నుంచి 142 ఉన్న 16 వార్డుల్లో కూవం, అడయారు నదులు ప్రవహిస్తున్నాయి. అలాగే, మాంబళం, జాఫర్‌ఖాన్‌పేట, ఎంజీఆర్ నగర్, విరుగంబాక్కం, కావాంగరై తదితర ఐదు చిన్న కాలువల నీరు కూవం, అడయారు నదుల్లో కలుస్తోంది. జాఫర్‌ఖాన్‌పేట, ఎంజీఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో కాలువల గట్లు దెబ్బతినడం, గోడ ఎత్తు తక్కువగా ఉంది. ఈ కాలువల్లోని నీరు జనావాస ప్రాంతాలకు చేరకుండా 1.7 కి.మీ దూరం ఎంజీఆర్ కాలువ పనులు రూ.16 కోట్లు, జాఫర్‌ఖాన్ పేట కాలువకు రూ.6 కోట్ల వ్యయంతో ప్రహరీ గోడ నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు.

పరందూరు విమానాశ్రయ వ్యవహారం..

వివరాలు తెలియకుండా విజయ్ మాట్లాడుతున్నారు

● డీఎంకే నేత ఆర్ఎస్ భారతి

ప్యారీస్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పరందూరు విమానాశ్రయ వ్యవహారంలో తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్ వివరాలు తెలియకుండా మాట్లాడుతున్నారని డీఎంకే ప్రిసీడియం కార్యదర్శి ఆర్ఎస్ భారతి తెలిపారు. తిరునల్వేలిలో మంగళవారం జరిగిన ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నాలుగేళ్ల పాలనలో నలభై ఏళ్ల సాధన పూర్తిచేసి రికార్డు సృష్టించారని, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను ప్రభుత్వం సమానంగా భావిస్తోందన్నారు. కాంచీపురం జిల్లా పరందూరు విమానాశ్రయం వ్యవహారంలో వాస్తవాలు తెలుసుకోకుండా తాజాగా రాజకీయాల్లోకి వచ్చిన నటుడు విజయ్ ఇలా మాట్లాడటం తగదన్నారు. రాజకీయ లబ్ధి కోసం పరందూరు వ్యవహారంలో విజయ్‌ను పావుగా వాడుతున్నారని భారతి విమర్శించారు.

పంటలు కోల్పోయిన రైతులను ఆదుకోవాలి

ప్యారీస్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): డెల్టా జిల్లాల్లో భారీ వర్షాలకు పంట నీట మునిగి నష్టపోయిన రైతులకు రాష్ట్రప్రభుత్వం నష్టపరిహారం పంపిణీ చేయాలని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత డిమాండ్ చేశారు. ఆమె బుధవారం మీడియాతో మాట్లాడుతూ, తంజావూరు, మైలాడుదురై సహా డెల్టాజిల్లాల్లో ఇటీవల భారీ వర్షాలకు చేతికందాల్సిన వరి పంట పూర్తిగా నీట మునిగిందని, నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేలు పరిహారంగా అందజేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

రాహుల్ గాంధీపై కేసు నమోదు

● ఈరోడ్‌లో కాంగ్రెస్ ధర్నా

చెన్నై, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాహుల్ గాంధీపై కేసు నమోదుచేసిన కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరి, ఆర్ఎస్ఎస్ సంఘాన్ని ఖండిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బుధవారం ధర్నా చేపట్టారు. ఈరోడ్ సూరంపట్టి ప్రాంతంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సెల్వపెరుందగై నేతృత్వంలో జరిగిన ధర్నాలో మాజీ రాష్ట్ర అధ్యక్షుడు తంగబాలు, ఎంపీ సుధ, ఎమ్మెల్యేలు రూబి మనోహరన్, గణేష్, ఈరోడ్ జిల్లా అధ్యక్షుడు తిరుసెల్వం సహా పలువురు జిల్లా నేతలు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈరోడ్ ఎన్నికల అధికారి మార్పు

టి.నగర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల నిర్వహణాధికారిని మార్పు చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వు జారీ చేసింది. ఈ నియోజకవర్గం అభ్యర్థుల జాబితా విడుదలయిన తర్వాత ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన బెంగళూరు మహిళ నామినేషన్‌ను తోసిపుచ్చాలంటూ పోటీలో ఉన్న మరో ముగ్గురు ఇండిపెండెంట్లు ఆందోళన జరుపటంతో అర్ధరాత్రి ఆమె నామినేషన్‌ను ఎన్నికల అధికారి మనీష్ తోసిపుచ్చారు. ఈ నేపథ్యంలో ఆయనను ఎన్నికల నిర్వహణాధికారి బాధ్యతలనుండి తప్పిస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వు వెలువరించింది. ఆయన స్థానంలో హోసూరు కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్‌ను ఎన్నికల నిర్వహణాధికారిగా నియమించింది. ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గం ఉప ఎన్నికలు ఫిబ్రవరి 5న జరుగనున్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో డీఎంకే తరఫున చంద్రకుమార్, నామ్ తమిళర్ కట్చి తరఫున సీతాలక్ష్మి, ఎన్నికల వీరుడిగా పేరుగాంచిన పద్మరాజన్ సహా 46 మంది పోటీలో ఉన్నారు.

రోడ్ల నిర్మాణాలకు రూ.వెయ్యి కోట్లు

పెరంబూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నగర ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1,000 కోట్లు కేటాయించింది. నగరాభివృద్ధిలో భాగంగా నగరాల సమీపంలో ఉన్న అభివృద్ధి చెందిన పంచాయతీలను విలీనం చేసే పనులను ప్రభుత్వం చేపట్టింది. అలా, విలీనమైన ప్రాంతాల్లో రోడ్లు అధ్వాన్న స్థితికి చేరుకున్నాయని ఆయా ప్రాంతాల ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై దృష్టి సారించిన ప్రభుత్వం, విస్తరించిన నగర ప్రాంతాల్లో రోడ్లు నిర్మాణాలకు రూ.1,000 కోట్లు కేటాయించింది.

పోలీస్ గ్రీవెన్స్‌కు 31 వినతులు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పోలీస్ కమిషనర్ అరుణ్

పెరంబూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ పరిధిలో బుధవారం గ్రీవెన్స్ జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అరుణ్ ప్రజల నుంచి 31 వినతులు స్వీకరించారు. ఈ సమస్యలను విచారించాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులను కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ (నిర్వహణ) కె.అదివీరపాండ్యన్ పాల్గొన్నారు.

స్పీకర్ల సదస్సులో గవర్నర్‌ను విమర్శించలేదు

● అసెంబ్లీ స్పీకర్ అప్పావు

ప్యారీస్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బిహార్ రాష్ట్రంలో జరిగిన సదస్సులో తాను తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని కించపరచేలా మాట్లాడలేదని రాష్ట్ర అసెంబ్లీ స్పీకరు అప్పావు పేర్కొన్నారు. తిరునల్వేలి సమీపంలోని పాళయంకోటలో తమిళనాడు క్రీడల అభివృద్ధి కమిషన్ స్విమ్మింగ్ పూల్‌లో బుధవారం పాఠశాలల ఈత పోటీలను స్పీకరు అప్పావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర అసెంబ్లీల స్పీకర్లు, డిప్యూటీ స్పీకర్ల సమాఖ్య ఆధ్వర్యంలో ఇటీవల బీహారులో నిర్వహించిన సదస్సులో తాను తమిళనాడు తరుపున పాల్గొని ప్రసంగించానని, రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి గురించి ఎలాంటి భిన్నాభిప్రాయాలు తెలియజేయలేదని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూ ఆ మహానాడు వేదికనుంచి వాకౌట్ చేశానని అప్పావు తెలిపారు.

తిరుచెందూర్‌లో సముద్రపు కోత

ఐఐటీ నిపుణుల అధ్యయనం

ప్యారీస్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్‌లో ఏర్పడిన సముద్ర కోతపై చెన్నై ఐఐటీ నిపుణుల బృందం రెండో రోజైన బుధవారం కూడా అధ్యయనం చేసింది. తిరుచెందూరులోని సుబ్రమణ్యస్వామి ఆలయానికి వెళ్లే భక్తులు ఆలయ సమీపంలో ఉన్న సముద్రంలో స్నానం చేసి స్వామి దర్శనానికి వెళ్తుంటారు. గత కొన్ని రోజులుగా సముద్రంలో అలలు ఎగసి పడుతున్నాయి. అలల తాకిడికి సుమారు 50 అడుగుల పొడవు, 9 అడుగుల లోతున సముద్రపు కోత ఏర్పడింది. దీంతో పోలీసులు తిరుచెందూరు సముద్రతీరంలో స్నానాలు నిషేధించి భద్రత కట్టుదిట్టం చేశారు. ఈ నేపథ్యంలో చెన్నై ఐఐటీ నిపుణుల బృందం సముద్రపు కోత ప్రాంతాలను పరిశీలించి ఆధారాలను సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

తిరుప్పోరూర్‌లో రెండో విమానాశ్రయం కట్టండి

● పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి సూచన



ప్యారీస్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రెండో విమానాశ్రయాన్ని పరందూరుకు ప్రత్యామ్నాయంగా తిరుప్పోరూర్‌లో నిర్మించాలని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి పేర్కొన్నారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ 2020వ సంవత్సరం అధికారంలో ఉన్న అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో కాంచీపురంజిల్లా పరందూరులో రెండో విమానాశ్రయానికి కావాల్సిన స్థలాన్ని అక్కడి గ్రామాల నుండి సేకరించినట్లు తెలిపారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో పరందూరులో విమానాశ్రయ పథకాన్ని తీసుకొచ్చిన ఘనత కేవలం డీఎంకే ప్రభుత్వానిదేనని ఆ పార్టీ నేతలు, మంత్రులు గొప్పలు చెప్పుకున్నారని, అయితే ప్రస్తుతం ఈ విమానాశ్రయం ఏర్పాటుకు ప్రజల నుండి అభ్యంతరాలు రావడంతో అధికార పార్టీ పెదవి విప్పకుండా ఆ వ్యవహారాన్ని గతంలోని అన్నాడీఎంకే ప్రభుత్వంపై నిందమోపడం సరికాదన్నారు. పరందూరు విమానాశ్రయ ఏర్పాటు వ్యవహారంలో అధికార డీఎంకే ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోందని విమర్శించారు. పరందూరుకు ప్రత్యామ్నాయంగా చెన్నై రెండో విమానాశ్రయాన్ని తిరుప్పోరూర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేస్తే ఎవరికి ఇబ్బంది ఉండదని ఆయన సూచించారు.

పాఠశాల భవన నిర్మాణాల పరిశీలన



భవన నిర్మాణాలు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రభు శంకర్

తిరుత్తణి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా ఆర్కే పేట తాలూకా అమ్మయారుకుప్పం ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణాలు రూ.2.36 కోట్లతో జరుగుతున్నాయి. ఈ పనులను బుధవారం జిల్లా కలెక్టర్ ప్రభు శంకర్ పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టి, నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

కంటి రెప్పల రుగ్మతకు అరుదైన శస్త్రచికిత్స

అడయార్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అరుదైన కంటి రుగ్మతలలో ఒకటైన బెనిన్ ఎసెన్షియల్ బ్లెఫారోస్పాస్మ్ (బీఈబీ)కు అత్యంత సంక్లిష్టమైన ఆపరేషన్‌ను నగరంలోని గ్లెన్‌గల్స్ ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. తద్వారా రోగికి నాలుగేళ్ళ తర్వాత స్వేచ్ఛాయుత జీవితాన్ని ప్రసాదించారు. వైద్య చరిత్రలో ఇది ఒక మైలురాయి వంటిదని, ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన వైద్య బృందానికి నాయకత్వం వహించిన ప్రఖ్యాత ఓక్యులోప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ రవీంద్ర మోహన్ వెల్లడించారు. ఈ ఆపరేషన్‌ను రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌కు చెందిన రిటైర్డ్ ఫారెస్ట్ అధికారికి చేసినట్టు తెలిపారు. దేశంలోని అనేక ప్రఖ్యాత ఆస్పత్రుల్లో చికిత్స పొందినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించలేకపోయారని, తమ వైద్యులు మాత్రం ఈ రుగ్మతకు శాశ్వత పరిష్కారం చూపించామని పేర్కొన్నారు.

పరిహారం కోసం రైతుల రాస్తారోకో



రాస్తారోకోలో తడిచిన పంట చూపుతున్న రైతులు

పెరంబూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి: వర్షాలతో తడిచిన పంటకు బీమా, పరిహారం అందించాలని కోరుతూ రైతులు బుధవారం రాస్తారోకో చేపట్టారు. మైలాడుదురై జిల్లాలో 1.69 లక్షల హెక్టార్లలో రైతులు సంబా సాగు చేపట్టారు. ఈ నెల 19వ తేది కురిసిన అకాల వర్షం కారణంగా సుమారు 26,850 హెక్టార్ల పంట నీట మునిగింది. కోతకు సిద్ధంగా ఉన్న పంట, పొలాల్లో పంట కోసి బస్తాల్లో ఉంచిన ధాన్యం తడిచిపోయాయి. ఈ విషయమై బాధిత రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు తెలిపినా ఇప్పటివరకు వారు నష్టపోయిన పంటలు పరిశీలించలేదని సమాచారం. దీంతో ఆగ్రహించిన రైతులు శీర్గాళి సమీంపలో మైలాడుదురై-పుంపుహార్ రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. సమాచారం అందుకున్న పుంపుహార్ పోలీసులు, శీర్గాళి తహసీల్దార్ అరుళ్‌జ్యోతి, వ్యవసాయ శాఖ ఏడీ రాజరాజన్ ఘటనా స్థలానికి చేరుకొని రైతులకు చర్చలు జరిపి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించి వెనుదిరిగారు.

నేటినుంచి ఈరోడ్‌లో తపాలా ఓట్ల నమోదు

చెన్నై, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ తూర్పు శాసనసభ ఉప ఎన్నికలో గురువారం నుంచి తపాలా ఓట్ల నమోదు ప్రారంభం కానుంది. 85 ఏళ్లు పైబడినవారు, దివ్యాంగులు తపాలా ఓటు వినియోగించుకోనున్నారు. ఫిబ్రవరి 5వ తేది జరుగనున్న ఈ ఉప ఎన్నికలో డీఎంకే అభ్యర్థిగా వీసీ చంద్రకుమార్, నామ్ తమిళర్ పార్టీ అభ్యర్థిగా సీతాలక్ష్మి సహా 46 మంది పోటీచేస్తున్నారు. అభ్యర్థులకు కేటాయించిన గుర్తులతోకూడిన బ్యాలెట్ పేపరు నమూనాను మంగళవారం ఎన్నికల అధికారి విడుదల చేశారు. ఈ ఎన్నికల్లో తపాలా ఓటు ద్వారా ఓటు హక్కు వినియోగించుకొనేందుకు 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఈ నెల 15వ తేదిలోపు దరఖాస్తు సమర్పించాలని ఎన్నికల అధికారి ప్రకటించారు. ఆయా ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల సూపర్‌వైజర్లు గురువారం నుంచి 24,25,27 తేదీల్లో తపాలా ఓటు కోరుతూ దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకే వెళ్లి ఓటు నమోదుచేసుకుంటారని ఎన్నికల అధికారి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల పరిశీలన



విద్యార్థులను పలుకరిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): 'మిమ్మల్ని వెతుకుంటూ మీ ఊరికి' కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి గుడియాత్తం పంచాయతీ యూనియన్‌లోని వలత్తూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. తరగతి గదికిలో బోధనా విధానంపై విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వడకాత్తిపట్టు గ్రామంలో రైతు భద్రత పథకం కింద 5 మంది లబ్దిదారులకు రూ.73 వేల విలువైన సంక్షేమ సహాయాలను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో గుడియాత్తం ఎమ్మెల్యే అమ్ములు, యూనియన్ కమిటీ అధ్యక్షుడు సత్యానందం, జిల్లా ఆరోగ్యశాఖ అధికారి భరణిదాస్, ఆంబూరు ఎమ్మెల్యే విల్వనాథన్, జిల్లా ప్రధాన విద్యాధికారి మణిమొళి, సబ్ కలెక్టర్ కలియమూర్తి, గుడియాత్తం తహసీల్దార్ మెర్లిన్ జ్యోతిక, యూనియన్ కమిటీ సభ్యుడు ఆనంది నిత్యానందం తదితరులున్నారు.

మా మధ్య అభిప్రాయభేదాలు లేవు

● టీఎన్‌సీసీ చీఫ్ సెల్వపెరుందగై

అడయార్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): డీఎంకే, కాంగ్రెస్ పార్టీ నేతల మధ్య ఎలాంటి అభిప్రాయబేదాలు లేవని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై స్పష్టం చేశారు. కోయంబత్తూరులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈరోడ్ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికల్లో డీఎంకే కూటమి తరపున పోటీ చేస్తున్న డీఎంకే అభ్యర్థికి మద్దతుగా కూటమి నేతలంతా ప్రచారం చేస్తారన్నారు. దేశ వ్యాప్తంగా ఇండియా కూటమి నేతలు ఐకమత్యంతో కలిసి పని చేస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. రాష్ట్రంలో డీఎంకే కూటమి నేతలు ముఖ్యంగా డీఎంకే, కాంగ్రెస్ నేతల మధ్య ఎలాంటి అభిప్రాయబేదాలు లేవని ఆయన స్పష్టం చేశారు.

29న పెరుంగళత్తూరులో అన్నాడీఎంకే ధర్నా

అడయార్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తాంబరం కార్పొరేషన్ పాలకులకు వ్యతిరేకంగా ఈ నెల 29న పెరుంగళత్తూరులో ధర్నా చేయనున్నట్టు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించారు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాంబరం కార్పొరేషన్ పరిధిలో తమ ప్రభుత్వ హయాంలో నిర్మాణాలు పూర్తయినా వినియోగంలోకి తెచ్చేందుకు తాంబరం కార్పొరేషన్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, దానిని వ్యతిరేకిస్తూ పెరుంగళత్తూరులో ధర్నా చేయనున్నట్టు వెల్లడించారు.

విద్యార్థినిపై లైంగిక వేధింపులు : టీచర్ అరెస్ట్

పెరంబూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లాలో విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన టీచర్‌ను పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్ట్ చేశారు. ఊదియూర్‌లోని ఓ పాఠశాల టీచర్ (54) విద్యార్థినిపై లైంగిక వేధింపులకు గురిచేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని విద్యార్థిని తల్లిదండ్రులకు తెలుపడంతో వారు కాంగేయం మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టిన పోలీసులు, పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి టీచర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

స్పా సెంటర్‌లో వ్యభిచారం

● మహిళ అరెస్ట్

పెరంబూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నానగర్ వెస్ట్‌లో స్పా సెంటర్‌లో వ్యభిచారం సాగిస్తున్న మహిళను పోలీసులు అరెస్ట్‌చేశారు. ఈ స్పా, మసాజ్ సెంటర్‌లో వ్యభిచారం జరుగుతున్నట్లు అన్నానగర్ పోలీసులకు సమాచారం అందింది. మహిళా పోలీసులు ఆ సెంటర్‌లో మంగళవారం తనిఖీలు చేపట్టి వ్యభిచారం జరుగుతున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో తిరువొత్తియూర్ తిరుచ్చినాంకుప్పం ప్రాంతానికి చెందిన ప్రేమను అరెస్ట్ చేశారు. ముగ్గురు మహిళలను ప్రభుత్వ హోంకు తరలించారు.

పుళల్ జైలు ఖైదీ మృతి

చెన్నై, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పుళల్ కేంద్ర కారాగారంలో బంధీగా ఉన్న ఖైదీ అనారోగ్యంతో మృతిచెందాడు. చెంగల్పట్టు ప్రాంతానికి చెందిన బాలాజి (45) కిలంబాక్కం ప్రాంతంలోని జరిగిన ఓ హత్య కేసుకు సంబంధించి 2022లో అరెస్టయి పుళల్ జైలులో బంధీగా ఉన్నాడు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న బాలాజీ, రెండు నెలలుగా స్టాన్లీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. జైలు అధికారుల ఫిర్యాదుతో పుళల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

విచారణకు హాజరుకాని ఇద్దరు రౌడీల అరెస్ట్

చెన్నై, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కేసు విచారణకు హాజరుకాని ఇద్దరు రౌడీలను పోలీసులు అరెస్ట్ చేశారు. పులియాంతోపు కన్నికాపురం దాస్ నగర్ ప్రాంతానికి చెందిన మారి అలియాస్ కొరుక్కుపేట మారి (39)పై హత్య, హత్యాయత్నం సహా 48 కేసులున్నాయి. కొన్ని కేసుల విచారణకు అతడు కోర్టుకు హాజరుకావడం లేదని సమాచారం. కోర్టు ఉత్తర్వుల మేరకు పులియాంతోపు ఆడుదొడ్డి ప్రాంతంలో ఉన్న మారిని పోలీసులు అరెస్ట్ చేశారు. అలాగే, పులియాంతోపు కన్నికాపురం ప్రాంతానికి చెందిన అజిత్ అలియాస్ శశికుమార్ (28)పై ఆరు క్రిమినల్ కేసులున్నాయి. ఆడుదొడ్డి ప్రాంతంలోని ఓ వ్యాపారిని డబ్బులు ఇవ్వాలని బెదిరించాడనే వ్యవహారంలో శశికుమార్‌ను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు.

గంజాయి, మత్తు మాత్రలు విక్రయిస్తున్న 8 మంది అరెస్ట్

చెన్నై, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమంగళం ప్రాంతంలో గంజాయి, మత్తు మాత్రలతో సంచరిస్తున్న 8 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుమంగళం ఇన్స్‌పెక్టర్ మహమ్మద్ సబీబుల్లా ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం రాత్రి తిరుమంగళం, పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఆటోలో వచ్చిన ఐదుగురు, ఒకే బైక్‌పై వచ్చిన ముగ్గురిని ఆపి తనిఖీచేయగా, గంజాయి, మత్తు మాత్రలు తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో విరుగంబాక్కంకు చెందిన రౌడీ కార్తీక్ (22), ఆయన అనుచరులు ప్రకాష్ (19), పల్లావరం ప్రాంతానికి చెందిన కిషోర్ (27), గోకుల్ (27), చూలైమేడు ప్రాంతానికి చెందిన బాలాజి (20), వడపళనికి చెందిన ఇమ్రాన్ (20), అశోక్ నగర్‌కు చెందిన జీవా (25), కేకే నగర్ ప్రాంతానికి చెందిన సురేష్‌లను అరెస్ట్ చేసి, వారి నుంచి 1.200 కిలోల గంజాయి, 150 మత్తు మాత్రలు, 8 సెల్‌ఫోన్లు, ఆటో, బైక్ స్వాధీనం చేసుకున్నారు. వీరు ఆంధ్ర, మహారాష్ట్ర నుంచి గంజాయి, మత్తు మాత్రలు తీసుకొచ్చి అన్నా నగర్, పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తుంటారని పోలీసుల విచారణలో తెలిసింది.

పొలాల్లో ప్రైవేటు పాఠశాల బస్సు బోల్తా

● డ్రైవర్ సహా విద్యార్థులకు గాయాలు



పొలాల్లో పడిన బస్సు

తిరుత్తణి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పొదటూరుపేట సమీపంలో ఓ పాఠశాల బస్సు పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటనలో 10 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. పొదటూరుపేట-తిరుత్తణి రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి విద్యార్థులను తీసుకొస్తున్న బస్సు, పేట కండ్రిగ జంక్షన్ వద్ద హఠాత్తుగా అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పొలాల్లోకి ఒరిగి పోయింది. ఈ ఘటనలో డ్రైవర్ సురేష్ సహా 10 మందికి గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు విద్యార్థులను రక్షించి, గాయపడిన వారిని 108 అంబులెన్స్ ద్వారా తిరుత్తణిలోని ఓ ఆసుపత్రికి తరలించారు. పొదటూరుపేట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



'సిగ్గు' అంటే ఏంటో తెలియదు

● వరలక్ష్మి శరత్‌కుమార్

తనకు సిగ్గుపడటమే కాదు.. సిగ్గు అంటే ఏంటో కూడా తెలియదని హీరోయిన్ వరలక్ష్మి అన్నారు. విశాల్, సంతానం, అంజలి, వరలక్ష్మి కలిసి నటించిన 'మద గదరాజా' సినిమా 12 యేళ్ళ తర్వాత విడుదలై ఘన విజయం సాధించి, పొంగల్ విన్నర్‌గా నిలిచింది. ఈ విజయాన్ని ఎంజాయ్ చేస్తున్న వరలక్ష్మి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'నేను చిన్నప్పటి నుంచి దూకుడుగానే ఉన్నాను. ఇప్పటికీ అలానే ఉంటున్నాను. నాకు వచ్చే పాత్రలు కూడా అలాంటివే. సిగ్గుపడటం లేదా అసలు సిగ్గు అంటే ఏంటో నాకు తెలియదు. సినిమాలో నటించేటపుడు కూడా నేను సిగ్గుపడిన సందర్భాలు లేవు. 'మద గజ రాజా'లో ఓ సన్నివేశంలో వయ్యారంగా నడిచి రావాలని దర్శకుడు చెప్పగా, నేను వేగంగా నడుచుకుంటూ వస్తాను. వెంటనే కట్ చెప్పి.. మగాడిలా కాదు.. ఆడపిల్లలా నడుచుకుంటూ రావాలని చెప్పి, ఎలా నడవాలో దర్శకుడు సుందర్ నడిచి చూపించారు. ఇలా అనేక చిన్న చిన్న విషయాలను ఆయన చేసి చూపించారు' అని పేర్కొన్నారు.

త్వరలోనే మోక్షం లభిస్తుంది

● తిరుపూరు సుబ్రహ్మణ్యం



కొన్నేళ్ళ క్రితం చిత్రీకరణ పూర్తి చేసుకుని విడుదలకు నోచుకోని చిత్రాలకు త్వరలోనే మోక్షం లభిస్తుందని తమిళనాడు థియేటర్స్ అండ్ మల్టీప్లెక్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపూరు సుబ్రహ్మణ్యం అభిప్రాయపడ్డారు. ఇటీవల 12 యేళ్ళ క్రితం షూటింగ్ పూర్తి చేసుకుని, సంక్రాంతికి విడుదలైన 'మదగజ రాజా' విడుదలై ఘన విజయం సాధించింది. దీంతో విడుదలకు నోచుకోని చిత్రాల విడుదలపై పలువురు సినీ ప్రముఖులు దృష్టిసారించారు. ఈ నేపథ్యంలో తిరుపూరు సుబ్రహ్మణ్యం స్పందిస్తూ, 'కొన్నేళ్ళ క్రితం చిత్రీకరణ పూర్తి చేసుకున్న 'ధృవనక్షత్రం', 'సర్వర్ సుందరం', 'ఇడం పొరుల్ ఎవల్', 'నరకాసురన్' వంటి చిత్రాలు విడుదలకాలేదు. 'మదగజరాజా' విడుదల తర్వాత కొన్నేళ్ళుగా పెండింగ్‌లో ఉన్న చిత్రాలను విడుదల చేసే అంశంపై దృష్టి సారించాం. చిత్రపరిశ్రమలోని ఫైనాన్షియర్లు, నిర్మాతలు, పంపిణీదారులను ఏకతాటిపైకి తెచ్చి ఈ చిత్రాలను విడుదల చేసే అంశంపై చర్యలు తీసుకుంటాం' అని పేర్కొన్నారు.

తమిళ చిత్రజ్యోతి

సంతానం హీరోగా 'డిడి నెక్ట్స్ లెవల్'

2023లో సంతానం, సురభి జంటగా నటించిన 'డిడి రిటర్న్స్' చిత్రానికి 'డిడి నెక్ట్స్ లెవల్' పేరుతో సీక్వెల్ రూపొందింది. సెల్వరాఘవన్, గౌతం వాసుదేవ్ మేనన్, యాషికా ఆనంద్, నిళల్‌గల్ రవి వంటి ప్రధాన తారాగణం నటించారు. నిహారిక ఎంటర్‌టైన్మెంట్స్, నటులు ఆర్య, సంతానం కలిసి ఈ చిత్రాన్ని నిర్మించగా, వేసవి స్పెషల్‌గా మేలో విడుదలకు ప్లాన్ చేస్తున్నారు. 2023లో వచ్చిన 'డిడి రిటర్న్స్' చిత్రానికి దర్శకత్వం వహించిన ప్రేమ్ ఆనంద్ ఈ సీక్వెల్‌కు కూడా దర్శకత్వం వహించారు. ఈ మూవీ వివరాలను దర్శకుడు వివరిస్తూ, 'డిడి రిటర్న్స్' భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. సీక్వెల్ కూడా అదే తరహాలో ఘన విజయం సాధించాలని భావించి, స్క్రిప్టు కోసం ఒక యేడాది సమయం తీసుకున్నాం. ప్రతి ఒక్కరూ నవ్వుకుని ఎంజాయ్ చేసేలా ఈ మూవీ ఉంటుంది. స్టోరీ మొత్తం ఒక లగ్జరీ షిప్, ఒక ద్వీపంలో జరుగుతుంది. ఇందుకోసం భారీ బడ్జెట్‌తో సెట్ వేశాం. తొలిభాగం కంటే రెండో భాగం మరింత ఫన్, ఎగ్జైట్‌మెంట్‌గా ఉంటుంది' అని పేర్కొన్నారు.



'డిడి నెక్ట్స్ లెవల్' ఫస్ట్‌లుక్

రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కోలీవుడ్ హీరోలు

తమిళ చిత్రపరిశ్రమకు చెందిన పలువురు హీరోలు సినిమాల్లో రాణిస్తూనే మరోవైపు వ్యాపారాలపై దృష్టిసారించారు. ముఖ్యంగా భూములు కొనుగోలు, రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తున్నారు. తాము నటించే చిత్రాల్లో రూ.కోట్లలో పారితోషికాలు తీసుకునే హీరోలు 'దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి' అన్న చందంగా స్టార్ డమ్ ఉన్న సమయంలోనే సొంత వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇలాంటి వారిలో సూర్య, ధనుష్, అజిత్, విజయ్, కార్తీ, ఆర్య, జీవా తదితరులు ముందున్నారు.

ప్రస్తుతం అగ్రనటులుగా రాణిస్తున్న వారిలో సూర్య చెన్నై మహానగరంలోని కమర్షియల్ ప్రాంతాల్లో ఇన్వెస్ట్ చేయడంతో పాటు ముంబైలో సొంతంగా లగ్జరీ హోం కొనుగోలు చేసి అక్కడే ఉంటున్నారు.

అదే విధంగా ధనుష్ కూడా రియల్ ఎస్టేట్‌లో ఇన్వెస్ట్ చేయడంతో పాటు చెన్నై నగరంలోని ప్రైమ్ లోకేషన్లలో భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. అజిత్ ఒక వైపు సినిమాల్లో నటిస్తూ, మరోవైపు కార్ రేసింగ్‌లపై దృష్టిసారించారు. అనేక ప్రైవేటు టూరిస్ట్ లోకేషన్లలో ఇన్వెస్ట్ చేయడంతో పాటు విదేశాల్లో భారీగా ఆస్తులు కొనుగోలు చేసినట్టు సమాచారం. ఇటీవల సొంతంగా అజిత్ కుమార్ కార్ రేసింగ్ కంపెనీ కూడా ప్రారంభించారు.

సినిమాల్లో సక్సెస్‌ఫుల్‌గా కొనసాగుతూ రాజకీయాల్లోకి వచ్చిన విజయ్ చెన్నైతో పాటు రాష్ట్రంలోని పలు ముఖ్య ప్రాంతాల్లో భారీగా పెట్టుబడులు పెట్టినట్టు సమాచారం.



సూర్య - ధనుష్



అజిత్ - విజయ్







ముమ్మరంగా గణతంత్ర దినోత్సవ రిహార్సల్స్

రిహార్సల్స్ దృశ్యాలు



చెన్నై, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దిన వేడుకల సందర్భంగా ప్రదర్శించే విన్యాసాలకు సంబంధించి త్రివిధ దళాలు, ఉద్యోగులు, విద్యార్థులు, కళాకారులు ముమ్మరంగా రిహార్సల్స్ చేస్తున్నారు. లైట్ హౌస్ సమీపంలోని కార్మికుల స్మారక స్థూపం వద్ద రిపబ్లిక్ డే రోజున గవర్నర్ ఆర్.ఎన్.రవి జాతీయ జెండా ఎగురవేయనున్నారు. వేడుకల్లో భాగంగా త్రివిధ దళాలు, పోలీసు, అగ్నిమాపక, జైళ్ల శాఖ సిబ్బంది కవాతు ప్రదర్శన, పాఠశాలలు, కళాశాలల విద్యార్థినుల నృత్యాలు, గ్రామీణ కళల ప్రదర్శన తదితరాలుంటాయి. కవాతు, నృత్యాల రిహార్సల్స్ రెండో విడతగా బుధవారం ఉదయం స్మారక స్థూపం ఎదురుగా ఉన్న రోడ్డుపై జరిగాయి. ఈ ప్రదర్శన చూసేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.









పొంగళ్లు పెడుతున్న దంపతులు

కన్నుడైనాయగి ఆలయంలో పొంగళ్ల వేడుక

పెరంబూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కన్నుడైనాయకి అమ్మవారి ఆలయం ముందు పొంగళ్లు పెట్టే వేడుకలు జరిగాయి. 200 ఏళ్ల నుంచి సంప్రదాయబద్ధంగా తై మాసం తొలి మంగళవారం శివగంగ జిల్లా నాట్టరసన్‌కోటలో ఈ వేడుకలు వైభవంగా నిర్వహించారు. నగరత్తార్ సామాజిక వర్గానికి చెందిన పురుషులకు వివాహమైన వెంటనే వారికి నెంబర్లు ఇస్తుంటారు. అలా నెంబర్లు కేటాయించిన వారు ఈ వేడుకల్లో పాల్గొంటారు. ఆ ప్రకారం, మంగళవారం సుమారు 916 మంది దంపతులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

శ్రీలంక నుంచి 41 మంది జాలర్ల విడుదల

పెరంబూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసిన 41 మంది జాలర్లను ఆ దేశ ప్రభుత్వం విడుదల చేయడంతో, విమానంలో నగరానికి చేరుకున్నారు. సరిహద్దులు దాటారంటూ గత సెప్టెంబరులో శ్రీలంక నావికాదళం రామనాథపురానికి చెందిన 41 మంది జాలర్లను అరెస్ట్ చేసింది. జాలర్లను విడిపించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ రాసిన లేఖపై స్పందించిన కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ఆ దేశ ప్రభుత్వంతో జరిపిన చర్చలు ఫలించాయి. జైళ్ల నుంచి జాలర్లను శ్రీలంకలోని భారత దేశ దౌత్యాధికారి కార్యాలయంలో అప్పగించగా, వారికి అత్యావసర పాస్‌పోర్ట్, విమాన టిక్కెట్లు అందజేసి కొలంబో నుంచి చెన్నైకి విమానంలో తరలించారు. జాలర్లను వారి వారి స్వగ్రామాలకు వాహనాల్లో పంపినట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు.



చెన్నై విమానాశ్రయానికి చేరుకున్న జాలర్లు



క్యాథ్ ల్యాబ్ ప్రారంభోత్సవంలో అతిథులు, నిర్వాహకులు

సీఎంసీ ఆధ్వర్యంలో క్యాథ్ ల్యాబ్ ప్రారంభం

వేలూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సీఎంసీ ఆస్పత్రి ప్రాంగణంలోని కార్డియాలజీ విభాగంలో అధునాతన పరికరాలు, టౌన్ హాలులో కొత్త క్యాథ్ ల్యాబ్ ప్రారంభించారు. ఈ ఆస్పత్రిలో 1956లో కార్డియాలజీ విభాగం ప్రారంభించారు. పలు రాష్ట్రాలు, విదేశాలకు చెందిన వారు కూడా ఈ ఆస్పత్రికి వచ్చి గుండెకు సంబంధించిన చికిత్సలు పొందుతున్నారు. ఈ క్రమంలో, టౌన్ హాలులో 7వ క్యాథ్ ల్యాబ్‌ను బుధవారం సీఎంసీ డైరెక్టర్ డా.విక్రమ్‌మేలీప్ ప్రారంభించారు. అత్యవసర వైద్యచికిత్సలకు సంబంధించి ఈ ల్యాబ్ అన్ని వసతులు ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

రిటైర్మెంట్ కమ్యూనిటీ కోసం జీటీ భారతి ప్రాజెక్టులు



ప్రాజెక్టు ఆవిష్కరణలో నిర్వాహకులు

అడయార్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జీటీ భారతి అర్బన్ డెవలప్‌మెంట్ సంస్థ రిటైర్మెంట్ కమ్యూనిటీ పీపుల్స్ కోసం రెండు అద్భుతమైన ప్రాజెక్టులను ప్రారంభించింది. ఎలిమెంట్స్ సత్వ, ఎలిమెంట్స్ కమలం పేరుతో వీటిని నగరంలో ప్రారంభించినట్టు ఎలిమెంట్స్ యాక్టివ్ సీనియర్ లివింగ్ డైరెక్టర్ అశ్విన్ కుమార్ అయ్యర్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నగర శివారు ప్రాంతమైన ఆలపాక్కంలో ఎలిమెంట్స్ కమలం కేవలం సింగిల్ సీనియర్ల కోసమే ఇండిపెండెంట్ సీనియర్ లీజింగ్ స్కీమ్ కింద రూపొందించినట్టు వెల్లడించారు. ఎలిమెంట్స్ సత్వ ప్రాజెక్టును అర్బన్ సీనియర్ లివింగ్ పేరుతో పోరూర్‌లో పూర్తి చేశామన్నారు. ఈ లివింగ్ ప్రాజెక్టుల్లో సేఫ్టీ, సెక్యూరిటీ, స్మార్ట్ హోమ్స్, మెడికల్, ఫిజియోథెరపీ సెంటర్, ఆయుర్వేదిక్ మసాజ్ అండ్ సలూన్ సర్వీస్, కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్, డైనింగ్ ఎక్స్‌పీరియన్స్ వంటి వసతులున్నాయని తెలిపారు.

తిరుత్తణి ఆలయానికి రోడ్డు సదుపాయంపై పరిశీలన

తిరుత్తణి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి కొండ ఆలయానికి రోడ్డు ఏర్పాటుపై బుధవారం మంత్రి ఏవీ వేలు అధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన తిరుత్తణి కొండ ఆలయానికి పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు ఈ నేపథ్యంలో, భక్తుల సౌకర్యార్థం కొండ ఆలయానికి రోడ్డు ఏర్పాటుపై విషయమై మంత్రి ఏవీ వేలు, దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, తమిళ అభివృద్ధి, ప్రవాస తమిళుల సంక్షేమ శాఖ మంత్రి ఎస్ఎం.నాజర్, స్థానిక ఎమ్మెల్యే చంద్రన్ పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా రైల్వేస్టేషన్ నుంచి ఆలయానికి వెళ్లేలా రాష్ట్ర రవాణా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత బస్సు ప్రయాణాన్ని మంత్రి జెండా ఊపి ప్రారంభించారు.



కొండ ఆలయానికి రోడ్డు వేసేందుకు స్థల పరిశీలిస్తున్న మంత్రులు వేలు, శేఖర్‌బాబు, నాజర్, ఎమ్మెల్యే చంద్రన్ తదితరులు



అళియార్ డ్యామ్‌పై ఫొటోకు ఫోజిస్తున్న రష్యన్ నృత్యకళాకారిణులు

ఆళియారు డ్యామ్‌లో రష్యన్ నృత్యకళాకారిణుల సందడి

టి.నగర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలోని పలు నగరాల్లో నృత్య ప్రదర్శనలిచ్చేందుకు విచ్చేసిన రష్యన్ కళాకారిణులు కోవై జిల్లా పొల్లాచ్చి సమీపంలోని ఆళియార్ జలాశయాన్ని సందర్శించారు. భారత్-రష్యా మైత్రీ సంఘం ఆధ్వర్యంలో సాంస్కృతిక మార్పిడి పథకంలో భాగంగా 50 మందికిపైగా రష్యన్ కళాకారులు దేశంలోని పలు నగరాల్లోనృత్య ప్రదర్శనలిచ్చారు. వీరంతా ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తున్నారు. ఆ మేరకు రష్యన్ నృత్య కళాకారిణులు ఆళియార్ జలాశయాన్ని సందర్శించి, ప్రకృతి సౌందర్యాలను తిలకించి ఆస్వాదించారు. ఆ సందర్భంగా డ్యామ్ సందర్శించేందుకు వచ్చిన పర్యాటకులు రష్యన్ కళాకారిణులతో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు.

'ఏసీ' సబర్బన్ రైలు ట్రయల్ రన్



ట్రయల్ రన్ పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

పెరంబూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో నడపనున్న తొలి 'ఏసీ' సబర్బన్ రైలు ట్రయల్ రన్ మంగళవారం నిర్వహించారు. చెన్నై బీచ్-చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్ రైలు మార్గంలో 'ఏసీ' సబర్బన్ రైలు నడపాలని దక్షిణ రైల్వే 2019లో రైల్వే బోర్డుకు విజ్ఞప్తి చేసింది. ఆ ప్రకారం, దక్షిణ రైల్వే చెన్నై డివిజన్‌కు రెండు ఏసీ సబర్బన్ రైళ్లు తయారుచేయాలని ఐసీఎఫ్‌కు రైల్వే బోర్డు ఆదేశించింది. ప్రస్తుతం ఏసీ సబర్బన్ రైలు తయారవడంతో, మంగళవారం ఐసీఎఫ్ ప్రాంగణంలో ట్రయల్ రన్ నిర్వహించారు. 12 బోగీలతో కూడిన ఈ రైలులోని భద్రతా అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ రైలును త్వరలో దక్షిణ చెన్నై డివిజన్ అధికారులకు అప్పగించనున్నారు. అనంతరం ఎక్స్‌ప్రెస్ రైలు మార్గంలో 110 కి.మీ వేగంతో ఈ రైలు ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. మరో రెండు నెలల్లో ఏసీ సబర్బన్ రైలు ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు.

కీటకాల ద్వారా సంక్రమించే వ్యాధులపై అంతర్జాతీయ సదస్సు



సదస్సులో వైద్య నిపుణులు

వేళచ్చేరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సవితా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్ (సీమాట్స్)లో మంగళవారం కీటకాల ద్వారా సంక్రమించే వ్యాధులపై అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమాన్ని 'ఇండియన్ చాప్టర్ ఫర్ వెక్టర్ ఎంకాలజీ, అకాడమీ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఎంటమాలజీ' సంయుక్త నిర్వహణలో జరిగింది. ఈ సదస్సులో వక్తలు మాట్లాడుతూ.. ఈ వ్యాధి నివారణలో ఎంటమాలజీ వైద్య నిపుణుల పాత్ర కీలకమన్నారు. అయితే వారి పాత్ర పరిమితంగా వుందని తెలిపారు. సీమాట్స్ వ్యవస్థాపకులు, ఛాన్సలర్ డాక్టర్ ఎన్ఎం.వీరయ్యన్ మాట్లాడుతూ.. దేశంలోని దంత వైద్య కళాశాలల్లో ప్రథమ స్థాయికి చేరుకుందని, అయితే తరువాత ఏడాది మూడోస్థానంలో నిలిచిందన్నారు. తిరిగి మొదటిస్థానం చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంకా డాక్టర్ రాజ్‌పాల్ యాదవ్, దీపక్ నెల్వస్వామి తదితరులు పాల్గొన్నారు.

11వ శతాబ్దం నాటి బుద్ధుడి విగ్రహం లభ్యం



బుద్ధుడు విగ్రహం

పెరంబూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం సమీపం దేవరియంబాక్కం గ్రామంలో ఉన్న శ్రీనివాస పెరుమాళ్ ఆలయంలో పాతబడిన వస్తువులు ఉంచారు. పొంగల్ వేడుకల సందర్భంగా ఆలయం శుభ్రం చేస్తున్న సమయంలో ఆ వస్తువుల్లో బుద్ధుడి విగ్రహం కనిపించింది. ఈ విగ్రహాన్ని వాలాజాబాద్ తాలూకా చరిత్ర అధ్యయన కేంద్రం అధికారి అజయ్‌కుమార్ పరిశీలించారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ... పాల రాతితో అడుగు ఎత్తులో విగ్రహం ఉందన్నారు. బుద్ధుడు ధ్యానం చేస్తున్నట్టుగా పీఠంపై కూర్చుని ఉన్నట్టు తెలిపారు. విగ్రహం ముక్కు దెబ్బతినిందన్నారు. కుడి కాలు ఎడమ తొడపై, ఎడమ చేయి కుడి కాలుపై ఉన్నట్లు, కుడి చేతి వేళ్లు నేల వైపు చూపుతున్నట్లు ఉన్నాయన్నారు. గోపురంలోని నాలుగు ప్రపంచ శాంతి విగ్రహాల్లో ఒకటిగా ఉండొచ్చని చరిత్రకారులు భావిస్తున్నారని తెలిపారు. ఈ విగ్రహం 11వ శతాబ్దానికి చెందిన బుద్ధుడి విగ్రహం అని, పురావస్తు శాఖ పరిశోధకులు రమేష్ నిర్ధారించారని ఆయన తెలిపారు.

ఎస్కేపీడీలో వైభవంగా దీపారాధన



జైశ్రీరామ్ ఆకృతిలో 366 దీపాలతో పూజ

ప్యారీస్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జ్‌టౌన్‌లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్కేపీడీ)లో అయోధ్య రామ మందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ తొలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం రాత్రి వైభవంగా వేడుకలు నిర్వహించారు. అ సందర్భంగా కన్యకా పరమేశ్వరి అమ్మవారిని, వేదికపై కొలుదీర్చిన సీతారాములను విశేషంగా అలంకరించారు. అదే విధంగా ఆలయ మహామండపంలో జైశ్రీరామ్ ఆకృతిలో 366 దీపాలు వెలిగించారు. ఈ వేడుకల్లో భాగంగా భజనగీతాలు ఆలపించిన మహామంత్ర భజనమండలి సభ్యులను ఎస్కేపీడీ ట్రస్టీలు ఊటుకూరు శరత్‌కుమార్, దేసు లక్ష్మీనారాయణ సహా నిర్వాహకులు సత్కరించి భక్తులందరికి ప్రసాదాలు పంపిణీ చేశారు.

శ్రీవారిసేవలో మేలుకోట్ మఠాధిపతి



మేలుకోట్ మఠాధిపతి యదుగిరి యతిరాజ స్వామి బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆలయ మహాద్వారం వద్దకు చేరుకున్న స్వామికి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అర్చకబృందం ఇస్తికఫాల్(ఆలయ మర్యాదలు)తో స్వాగతం పలికారు. అలాగే బిగ్‌బాస్ ఫేం నటి అశ్వినిశ్రీ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఆలయం ముందు యతిరాజ స్వామిజీ - అశ్వినిశ్రీ


చిత్రకూట్‌లో వైభవంగా శ్రీనివాసకల్యాణం

తిరుమల, జనవరి22(ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళా సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని చిత్రకూట్ నగరంలో ఉత్తరాది అహోబిలం మఠంలో బుధవారం ఉదయం శ్రీనివాస కల్యాణాన్ని టీటీడీ అంగరంగ వైభవంగా నిర్వహించింది. తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు ఆధ్వర్యంలో అర్చక బృందం ఉదయం 11 నుంచి 12 గంటల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 1008 రాజ్ గురు పీఠాధీశ్వర్ స్వామి బద్రి ప్రసన్నాచార్యజీ మహరాజ్, టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్ గుణభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న అధ్యయనోత్సవాలు

తిరుమల, జనవరి22(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబరు 30న ప్రారంభమైన అధ్యయనోత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. 25 రోజుల్లో ఆళ్వార్ దివ్యప్రబంధంలోని 4 వేల పాశురాలను శ్రీవైష్ణవులు స్వామివారి ఆలయంలోని రంగనాయక మండపంలో పారాయణం చేశారు. నేడు తణ్ణీరముదు ఉత్సవంతో అధ్యయనోత్సవాలు ముగుస్తాయి.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 23 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం నాటి హుండీ ఆదాయం: రూ.4.04 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 60,581

తలనీలాలు సమర్పించినవారు: 19,228



మల్లిమడుగు రిజర్వాయరు పరిసరాల్లో ఎక్స్‌కవేటర్‌తో టిప్పర్‌లో నింపుతున్న మట్టి

మల్లిమడుగులో మళ్లీ మట్టి తవ్వకాలు

- మైనింగ్ శాఖ పేరుతో చెక్‌పోస్టు
- చోద్యం చూస్తున్న అధికారులు

రేణిగుంట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మల్లిమడుగు రిజర్వాయరులో మళ్లీ అక్రమ మట్టి తవ్వకాలు మొదలయ్యాయి. ఏకంగా మైనింగ్ శాఖ సిబ్బంది అంటూ అనధికారికంగా చెక్‌పోస్టు ఏర్పాటు చేసి రాత్రీపగలు టన్నుల కొద్దీ మట్టిని టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు కానీ, రెవెన్యూ అధికారులు కానీ ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి నెల నుంచి ఇక్కడినుంచి పలక మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని ఆంధ్రజ్యోతి దినపత్రికలో వరుస కథనాలు వెలువడ్డాయి. స్పందించిన తహసీల్దారు సురేష్‌బాబు మూడు నెలల క్రితం ఈ ప్రాంతాన్ని తనిఖీ చేశారు. టిప్పర్లు, లారీలు వెళ్లకుండా ప్రత్యేకంగా మూడు చోట్ల కందకాలను తవ్వించి మట్టి అక్రమ రవాణాకు అడ్డు కట్ట వేశారు. అయితే గడిచిన నెల రోజులుగా రాత్రి సమయంలో మాత్రం గుట్టుచప్పుడు కాకుండా టిప్పర్లలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. ఇటీవల పది రోజులుగా రేణిగుంట, కడప ప్రధాన రహదారిలోని ఆంజనేయపురం చెక్‌పోస్టు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద మల్లిమడుగు రిజర్వాయరులోకి వెళ్లే మట్టిరోడ్డు వద్ద ప్రత్యేక చెక్‌పోస్టును తలపించేలా ఇనుప రేకులతో రూమును ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఇరువైపులా ప్రత్యేక డ్రెస్ కోడ్‌తో యువకులను ఉంచారు. వీరు రెండు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నారు. మల్లిమడుగు రిజర్వాయరు నుంచి వెళ్లే లారీ నెంబర్లను బిల్లులను రిజిస్టర్‌లో నమోదు చేస్తూ ఉంటారు. ఈ యువకులను ప్రశ్నించగా తాము మైనింగ్ శాఖకు సంబంధించిన వాళ్లమని కడప వైపు నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేస్తామని చెప్పుకొచ్చారు. అయితే మల్లిమడుగు రిజర్వాయరులో మట్టి తరలింపునకు అనధికారికంగా వేలం నిర్వహిస్తే తిరుపతికి చెందిన కొంతమంది అధిక మొత్తంలో పాడుకున్నట్టు తెలుస్తోంది. ఇక్కడి మట్టిని తిరుపతి, చంద్రగిరి, పాకాల, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, పుత్తూరు, నగరి ప్రాంతాలకు ప్రతి రోజు తరలిస్తున్నారు. ఈ లారీలు ఇప్పటి వరకు నిత్యం ఈ రహదారిలో విధులు నిర్వహించే బ్రేక్ ఇన్‌స్పెక్టర్, పోలీసులకు కనపడకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇప్పటికైనా మట్టి, ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు మైనింగ్ శాఖ అధికారులు, మండల పోలీసులు, రెవెన్యూ, మండల అధికారులను సమన్వయం చేసుకుని ముందుకు వెళితే కొంతైనా ఈ అక్రమ రవాణాన్ని కట్టడి చేసే అవకాశం ఉంటుంది. ఈ విషయమై జిల్లా మైనింగ్ శాఖ అధికారి బాలాజీని వివరణ కోరగా మల్లిమడుగు రిజర్వాయర్ ప్రాంతంలో ఎటువంటి అనుమతులు ఎవరికీ ఇవ్వలేదని స్పష్టం చేశారు.



చెక్‌పోస్టు వద్ద మైనింగ్ శాఖ సిబ్బందిగా చెబుతున్న యువకుల ఫొటోలు తీస్తుండగా జారుకుంటున్న దృశ్యం



మట్టి అక్రమ తరలింపునకు ముద్రించిన బిల్లు



కమ్మలు తీసిస్తూ.. - మెడలో గొలుసు తీసిస్తున్న విద్యార్థిని

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

- తొలిరోజు 89మంది విద్యార్థులు గైర్హాజరు

తిరుపతిరూరల్, జనవరి22(ఆంధ్రజ్యోతి): ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీలలో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన తొలివిడత జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం జిల్లాలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9-12గంటలు, మధ్యాహ్నం 3-6గంటల వరకు జరిగిన ఈ పరీక్షలకు తొలిరోజు 2326మంది విద్యార్థులకుగాను 2237 మంది హాజరై పరీక్ష రాశారని సిటీకోఆర్డినేటర్ టిక్కైలాష్‌నాథ్ పేర్కొన్నారు. 89మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదన్నారు. ఎన్‌టీఏ నిబంధనల ప్రకారం విద్యార్థులను క్షుణంగా తనిఖీ చేసి కేంద్రాలోకి అనుమతించారు. చెవిలో కమ్మలు, మెడలో గొలుసులు, కాళ్ల వద్ద డ్రెస్‌కు దారాలుంటూ వీటినీ తీసేయించారు. నిర్ణీత సమయానికి కేంద్రాల వద్ద ప్రధాన గేటును మూసివేశారు. జిల్లాలో తిరుపతిరూరల్‌మండలం జూపార్క్‌రోడ్డు (చెర్లోపల్లె)లోని అయాన్‌డిజిటల్, చంద్రగిరిమండలంలో రామిరెడ్డిపల్లెలోని కేఎంఎం, కోటమండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల కేంద్రాలను కేటాయించారు. కాగా చెర్లోపల్లెలోని అయాన్‌డిజిటల్ కేంద్రం వద్ద ఉదయం 7గంటల నుంచి విద్యార్థులు వారి తల్లిదండ్రులతో సందడి నెలకొంది. విద్యార్థులు దాదాపుగా సకాలంలో కేంద్రాలకు చేరుకోవడం జరిగింది. ఆలస్యంగా వచ్చి వెనుతిరిగిన సంఘటనలు చోటుచేసుకోలేదు. సహాయకులుగా వచ్చిన వారు విద్యార్థులకు ఆల్‌దిబెస్ట్ చెబుతూ కనిపించారు. కాగా తొలి రోజు నిర్వహించిన పరీక్షలో ప్రశ్నాపత్రం ఈజీగా ఉందని కొందరు విద్యార్థులు అంటుండగా.. మరికొందరు గణితం, ఫిజిక్స్ సబ్జెక్టుల ప్రశ్నలు కొంత కఠినంగా, కెమిస్ట్రీ ప్రశ్నలు కొంత ఈజీగా ఉన్నాయని చర్చించుకుంటూ కనిపించారు.



తిరుపతి నగరం జూపార్కు రోడ్డులోని అయాన్ డిజిటల్ కేంద్రంలో విద్యార్థులు

జిల్లాకు 79 కొత్త ఆర్టీసీ బస్సులు



తిరుపతి(ఆర్టీసీ), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని 10 డిపోలకు 79 నూతన ఆర్టీసీ బస్సులు వచ్చాయి. ఇందులో ఆర్టీసీ సొంత బస్సులు 50, అద్దె బస్సులు 29 ఉన్నాయి. ఇప్పటికే కొన్ని బస్సులు వివిధ రూట్లలో తిరుగుతుండగా కొన్ని మాత్రం రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్నాయి. అవి కూడా ఈ వారంలో రోడ్డెక్కుతాయని డీపీటీవో నరసింహులు తెలిపారు.

సొంత బస్సులు: అల్ట్రా డీలక్స్- తిరుపతి డిపోకు 2, సూపర్‌లగ్జరీ- తిరుపతి 7, వెంకటగిరి 6, శ్రీకాళహస్తి 3, మంగళం, సత్యవేడు ఒక్కొక్కటి, ఎక్స్‌ప్రెస్‌లు-వాకాడు 12, గూడూరు, వెంకటగిరి 9చొప్పున.

అద్దె బస్సులు: సూపర్‌లగ్జరీ-తిరుపతి 2, ఎక్స్‌ప్రెస్‌లు-తిరుపతి 3, వెంకటగిరి 10, గూడూరు 1, వాకాడు 4. పల్లెవెలుగు-శ్రీకాళహస్తి 1, సత్యవేడు 3, వెంకటగిరి 2, గూడూరు 3.

ఉపసర్పంచి కుటుంబానికి పరిహారం అందజేత



చంద్రగిరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడిలో ఇటీవల మృతి చెందిన కందులవారిపల్లె పంచాయతీ ఉప సర్పంచ్ రాకేష్‌చౌదరి కుటుంబానికి అటవీశాఖ నష్టపరిహారం ప్రకటించింది. పరిహారం కింద రూ.10 లక్షల చెక్కును ఆ శాఖ అధికారులు బుధవారం బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి,ఎఫ్ఆర్వో అనిత, ఎఫ్‌బీవో చిత్ర, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సింగు సుధా తదితరులు పాల్గొన్నారు.

హలో.. మేము సీబీఐ

- మనీ లాండరింగ్ కేసులో అరెస్టు చేస్తామంటూ వృద్ధురాలికి బెదిరింపు
- రూ.2.5 కోట్లు లాగేసుకున్న సైబర్ నేరగాళ్లు
- కేసు పెట్టిన పది రోజుల్లోనే నిందితుడి అరెస్టు
- రూ.24.5 లక్షల రికవరీ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 22(ఆంధ్రజ్యోతి): 'హలో.. మేము సీబీఐ' అంటూ డిజిటల్ అరెస్టుల పేరిట సైబర్ నేరగాళ్లు బెదిరిస్తున్నారు. మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారంటూ.. తిరుపతిలో ఓ 65 ఏళ్ల మహిళను భయపెట్టారు. ఆమె నుంచి రూ.2.5 కోట్లు లాగేశారు. బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన వెస్ట్ పోలీసులు రాజమహేంద్రవరానికి చెందిన కీలక నిందితుడిని అరెస్టు చేశారు. ఈ వివరాలను బుధవారం సాయంత్రం ఇన్‌చార్జి ఎస్పీ మణికంఠ చందోలు మీడియాకు వెల్లడించారు. ఆ ప్రకారం.. రాజమహేంద్రవరానికి చెందిన పాలకొల్లు అరుణ్‌వినయ్‌కుమార్ ఎంబీఏ చదివాడు. ఈజీ మనీ కోసం దారులు వెదికాడు. వాట్సాప్ కాల్స్ ద్వారా అమాయకులను బెదిరించి వివిధ అకౌంట్లకు డబ్బులు వేసుకునేవాడు. ఇలా తిరుపతికి చెందిన 65 ఏళ్ల మహిళకు గతేడాది డిసెంబరులో వాట్సాప్ కాల్ వచ్చింది. తాను ఢిల్లీలో సీబీఐ అధికారినని చెప్పాడు. రూ.200 కోట్ల మనీలాండరింగ్ చేశావని, నీపై సీబీఐ కేసు నమోదైందని బెదిరించాడు. బ్యాంకు అకౌంట్ల నుంచి చట్ట వ్యతిరేకంగా వివిధ కార్యకలాపాలకు నగదు వాడుతున్నందున అరెస్టు చేస్తామని చెప్పాడు. ఇలా.. మరికొందరు సీబీఐ అంటూ ఆమెకు ఫోన్లు చేశారు. మీ అకౌంటులోని డబ్బులు తమకు పంపితే.. ఆ నగదు మనీలాండరింగ్‌లో ఉందా లేదా అనేది దర్యాప్తు చేస్తామని, లేకుంటే మీ ఖాతాలకు జమ చేస్తామన్నారు. ఆమెను మాయమాటలతో నమ్మించి దాదాపు రూ.2.5 కోట్లు వివిధ ఖాతాలకు జమచేసుకున్నారు. చివరకు తాను సైబర్ నేరగాళ్ల నుంచి మోసపోయానని గుర్తించిన బాధిత మహిళ ఈ నెల 13న వెస్ట్ సీఐ మురళీమోహన్‌కు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

దర్యాప్తునకు ప్రత్యేక బృందాలు

ఈ కేసు దర్యాప్తునకు అదనపు ఎస్పీ వెంకట్రావు నేతృత్వంలో డీఎస్పీ వెంకటనారాయణ పర్యవేక్షణలో సీఐలు వినోద్ (సైబర్ క్రైం), మురళీమోహన్ (వెస్ట్), ప్రకాష్‌కుమార్ (క్రైం), ఎస్ఐలు, సిబ్బందితో బృందాలను ఏర్పాటు చేశారు. నిందితులు వాడిన సెల్ ఫోను నెంబరు, బాధితురాలికి వచ్చిన వాట్సాప్ కాల్ నెంబరు ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. రాజమహేంద్రవరం కేంద్రంగా ఇలా బెదిరించి ఆన్‌లైన్ ద్వారా నిందితులు డబ్బులు కాజేస్తున్నట్లు గుర్తించారు. ఈ కేసులో కీలక నిందితుడు అరుణ్ వినయ్‌కుమార్‌ను బుధవారం రాజమహేంద్రవరంలో అరెస్టు చేసి తిరుపతికి తీసుకొచ్చారు. ఎస్పీ ఆధ్వర్యంలో మీడియా ముందు హాజరుపరిచారు. ఇతడి నుంచి కొత్త కారు, బ్యాంకులోని రూ24.5 లక్షల నగదు, రెండు ల్యాప్‌టాప్‌లు, రెండు సెల్ ఫోన్లు, 16 గ్రాముల బంగారు నగలు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఇంకా ఆరేడుగురు నిందితులున్నారని, వారికోసం గాలిస్తున్నారు. ఈ కేసులో కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఇన్‌చార్జి ఎస్పీ మణికంఠ అభినందించారు. వారికి రివార్డులు ప్రకటించారు.



అంతర్జాతీయ సైబర్ నేరగాడు అరెస్టు చేసి నగదు, బంగారు నగలు స్వాధీనం చేసుకున్న తిరుపతి పోలీసులు

వెంబకోట తవ్వకాల్లో మట్టి ముంత, శంఖపు గాజు



తవ్వకాలో బయల్పడిన ముంత, శంఖంతో తయారైన చేతి గాజు ముక్క

టి.నగర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వెంబకోట వద్ద జరిపిన తవ్వకాల్లో ప్రాచీన కాలం నాటి మట్టి ముంత, శంఖపు గాజుముక్క బయల్పడ్డాయి. విరుదుగనర్ జిల్లా వెంబకోట సమీపం విజయ కరిచల్‌కుళం వద్ద మూడో విడత పురావస్తు తవ్వకాలు జరుగుతున్నాయి. ఆ ప్రాంతంలో ఇప్పటిదాకా 16 గుంతలు తవ్వగా 2 వేలకు పైగా ప్రాచీన కాలం నాటి వస్తువులు లభ్యమయ్యాయి. గత నెల ఎరుపురంగులో కాల్చిన మట్టితో తయారైన అలంకరణ వస్తువును తలపై ధరించి ఉన్న మానవుడి శిరస్సు లభించింది. ఈ నేపథ్యంలో వెంబకోట వద్ద మూడో విడత పురావస్తు తవ్వకాల్లో మట్టితో తయారైన ముంత, శంఖంతో తయారైన చేతి గాజు ముక్క లభ్యమయ్యాయి.

తిరుపతిలో తమిళనాడు భక్తుడి మృతి

తిరుపతి(నేరవిభాగం), జనవరి 22(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం విరుధనగర్‌కు చెందిన జయకన్నన్ (45) బుధవారం తిరుపతిలోని ఓ లాడ్జిలో మృతిచెందారు. ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ కథనం మేరకు.. కొంతకాలంగా మూర్ఛతో బాధపడుతున్న జయకన్నన్, మంగళవాం శ్రీవారి దర్శనార్థం తిరుమల వచ్చారు. తిరుపతి ఈస్ట్ పరిధిలోని ఓ లాడ్జిలో గది తీసుకున్నారు. మద్యం తాగి పడుకున్న ఆయన ఎంతకీ బయటకు రాలేదు. సిబ్బంది తలుపులు తట్టినా స్పందించకపోవడంతో నిర్వాహకులు ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కేసు నమోదు చేశారు.

ఉద్యోగం ఇప్పిస్తామని రూ.11 లక్షలు కాజేసారు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి తిరుపతి యాదవకాలనీకి చెందిన పి.హేమలత వద్ద ముగ్గురు దాదాపు రూ.11లక్షలు కాజేశారు. బాధితురాలు తెలిపిన ప్రకారం.. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న ఈమెను కొందరు కలిశారు. డబ్బులిస్తే ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించారు. ఈ క్రమంలో గుంటూరుకు చెందిన లక్ష్మీనారాయణకు 6.57 లక్షలు, సనబోయిన వినీత్‌కుమార్‌కు రూ.2.15 లక్షలు, మారేడు నరేష్‌కుమార్‌కు రూ.2.40 లక్షలు పంపారు. ఎంతకూ ఉద్యోగం రాకపోవడంతో మోసపోయానని గుర్తించిన ఆమె బుధవారం ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా వర్సిటీలో పరిశోధనా ప్రాజెక్టులో రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టుకు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలి. 27న ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఎంపీఈడీ, ఎమ్మెస్సీ హోంసైన్స్ చదువుకున్న వారు అర్హులు. ఇతర వివరాలకు ఎస్‌పీఎంవీవీ.. వెబ్‌సైట్ చూడాలని వర్సిటీ పీఆర్వో డాక్టర్ శ్రీరజని కోరారు.



భక్తులను ఆశీర్వదిస్తున్న దేవయానై

రెండు నెలల అనంతరం భక్తులతో...

పెరంబూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ ఆలయ ఏనుగు దేవయానై ఆశీర్వదిస్తుండడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది నవంబరు 18వ తేది ఏనుగు దేవయానై దాడిలో మావటి ఉదయకుమార్, ఆయన బంధువు శశుపాలన్ మృతిచెందారు. ఈ ఘటన అనంతరం ఏనుగును ఆలయ నిర్వాహకులు, అటవీ, పశు సంవర్ధక శాఖల ఆధ్వర్యంలో గదిలో ఉంచి పర్యవేక్షించారు. కొద్దిరోజుల అనంతరం ఏనుగును బయటకు తీసుకొచ్చి, వాకింగ్ శిక్షణ ఇచ్చారు. ఆ సమయంలో ఏనుగు భక్తులను ఆశీర్వదించేందుకు అనుమతించలేదు. ఆ నేపథ్యంలో, మంగళవారం ఏనుగు ఆలయ ప్రాంగణంలో వాకింగ్ చేస్తుండగా, కొందరు భక్తులు ఏనుగు వద్దకు వచ్చారు. రెండు నెలల అనంతరం ఏనుగు దేవయానై భక్తుల తలపై తొండం ఉంచి ఆశీర్వదించడంతో వారు పరవశించిపోయారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

సామాన్య భక్తులకే ప్రాధాన్యం

- ముక్కంటి మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్న ఎమ్మెల్యే, కలెక్టర్

శ్రీకాళహస్తి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో సామాన్య భక్తులకే అధిక ప్రాధాన్యమిస్తూ వైభవోపేతంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్, కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ముక్కంటి ఆలయ పరిపాలన భవనంలో బుధవారం మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో తొలి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆలయ ఈవో బాపిరెడ్డితోను.. పోలీసు, మున్సిపల్, విద్యుత్, ఇరిగేషన్, ఆర్ అండ్‌బీ, అగ్నిమాపక, వైద్య తదితర శాఖల అధికారులతో ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. ఏర్పాట్లు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'వైసీపీ హయాంలో జరిగిన మహాశివరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి స్వామివారి గర్భగుడి వద్ద బైఠాయించి సామాన్య భక్తులను ఇబ్బందులకు గురిచేశారు. వారి పార్టీ కార్యకర్తలను దళారులుగా మార్చారు. ఇప్పుడు అలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టంగా వ్యవహరిస్తాం. భక్తులందరూ సులభంగా టిక్కెట్లు కొనుగోలు చేసేలా 14 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. ఈ కౌంటర్ల వద్ద రద్దీ తగ్గించేందుకు అన్ని పత్రికల్లో బార్‌కోడ్ ద్వారా ప్రకటనలు ఇస్తాం. దీంతో ఆన్‌లైన్‌లోనూ దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసేలా శ్రీకారం చుడుతున్నాం' అని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు.

10 లక్షల మందికి దర్శనం

వీఐపీల కోసం ప్రత్యేక టైంస్లాట్ కేటాయించడంపై కసరత్తు చేస్తున్నామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. 13రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో సుమారు 10లక్షల మంది భక్తులకు దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. సాధారణ రోజుల్లో 750మందిని, కీలక రోజులుగా అదనంగా మరో 450మందిని బందోబస్తుకు కేటాయిస్తామన్నారు. ప్రస్తుతం 175 మరుగుదొడ్లు ఉండగా, ఫిబ్రవరి 21 నుంచి మార్చి 6 వరకు అదనంగా 200 మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తామన్నారు. పారిశుధ్య నిర్వహణ కోసం పట్టణ పారిశుధ్య సిబ్బందితో పాటు పొరుగు మండలాలు, మున్సిపాలిటీల నుంచి సిబ్బందిని బ్రహ్మోత్సవాలకు వినియోగిస్తామని వెల్లడించారు. పట్టణవ్యాప్తంగా సీసీ కెమెరాలు, డ్రోన్లతో పర్యవేక్షిస్తామన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేక బృందాలను నియమిస్తామన్నారు. 13రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో విద్యుత్, ఆహారం, తాగునీరు సరఫరాకు ఎక్కడా చిన్న ఆటంకం కూడా ఏర్పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే ఉత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.